క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఎమ్మార్పీఎస్ ప్రచారం


ఇంటింటి ప్రచారం చేస్తున్న సుబ్బయ్య, ఓబులేసు

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం కోవెలకుంట్ల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిజనవేముల, పెద్దకొప్పెర్ల, వెలగటూరు గ్రామాల్లో నాయకులు కత్తి సుబ్బయ్య, న్యాయవాది ఓబులేసు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని, ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, పుల్లయ్య, శేఖర్, లక్ష్మయ్య, విజయకుమార్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయి


కోవెలకుంట్ల: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రజక నాయకులు

కోవెలకుంట్ల: ప్రతి కుటుంబానికి ప్రభుత్వం వర్తింప చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయని రజక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆల్వకొండ మద్దిలేటి తెలిపారు. పట్టణంలోని కరెంట్ ఆఫీస్, సుంకులమ్మవీధి, చాకలిపేట, సీవీరామన్ కళాశాల వీధి, పూసలబజార్, సంతపేట, తదితర రజక కాలనీల్లో రజక నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలతిమ్మయ్య, శేషు, సుబ్బరాయుడు, మద్దిలేటి, మధు, పెద్ద ఆంజనేయులు, పక్కీర, పవన్, నాగమయ్య, చిన్నపక్కీర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లెలో శనివారం ఓ వృద్ధురాలు రైలు ఢీకొని మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు నాగమ్మ (65) ఉదయం ఉపాధి పనికి వెళ్తుండగా నంద్యాల- కడప డెమో రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి చెవుడు ఉన్నందున రైలును గమనించలేదు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి శనివారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. బాబు అనే వ్యక్తి కోవెలకుంట్ల నుంచి బైక్‌లో 45 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. బాటిళ్లు సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్ రెడ్డి

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి, జలదుర్గం ఎస్‌ఐ విజయ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని నల్లమేకలపల్లి, గార్లదిన్నె, హుసేనాపురం, మెట్టుపల్లి గ్రామాల్లో శనివారం వారు ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి వదంతులు నమ్మవద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 13వ తేదీన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలని సూచించారు. ప్రజలకు హక్కులకు భంగం కలిగిస్తే ఉపేక్షించమని, ఎంతటివారైనా శిక్షి తప్పదని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన యువతి సంపంగి లావణ్య అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని నందివర్గం స్టేషన్ ఎస్‌ఐ తిరుపాల్ శనివారం తెలిపారు. సుబ్బలక్ష్మమ్మ కూతురు లావణ్య ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లింది. బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకి లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని మల్యాల గ్రామం వద్ద శుక్రవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి గౌరబ్ మిత్రా(22) అనే యువకుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించామన్నారు. ఆధార్, సెల్ ఫోన్ ఆధారంగా వెస్ట్‌బెంగాల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. మృతదేహన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసుకొని పోస్టు మార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని రైల్వే పోలీసులు తెలిపారు.

ఉప్పొంగిన ఉత్సాహం

- హోరెత్తిన మంత్రి బుగ్గన ఎన్నికల ప్రచార ముగింపు ర్యాలీ
- తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- కిటకిటలాడిన డోన్ పట్టణం
- ఆకట్టుకున్న మహిళల నృత్యాలు


ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ పట్టణంలో శనివారం నిర్వహించిన ముగింపు ర్యాలీ కిటకిటలాడింది. అమ్మ హోటల్ సర్కిల్ నుంచి పాత బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో జనం ఉత్సాహం ఉప్పొంగింది. ప్రచారం వాహనంపై నుంచి మంత్రి ప్రతిఒక్కరికీ అభివాదం చేయగా యువత కేరింతలు కొట్టారు. మంత్రితో కరచాలం చేసేందుకు పోటీ పడ్డారు. అభిమానులు మంత్రిపై పూల వర్షం కురిపించారు. బాణా సంచా పేలుస్తూ, బెలున్లు ఎగురవేస్తూ కేరింతలు కొడుతూ యవత తమ అభిమానాన్ని చాటుకున్నారు. పట్టణ ప్రజలతోపాటు గ్రామీణులు తరలిరావడంతో ప్రధాన రహదారికి కిక్కిరిసిపోయింది. జై జగన్... జైజై బుగ్గన నినాదం హోరెత్తింది. డప్పుల మోతలు పండుగవాతావరణాన్ని తలపించాయి. యువతులతోపాటు మహిళా కౌన్సిలర్లు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మీకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం... దీవించండి!

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా డోన్ నియోజకవర్గ పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు డోన్‌ను మోడల్ నియోజకర్గంగా తీర్చిదిద్ది...మీకిచ్చిన మాట నిలబెట్టుకున్నామని, మరోమారు దీవించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ముగింపు ర్యాలీ సందర్భంగా పాతబస్టాండ్‌లో నిర్వహించిన సభలో మంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంకితభావంతో డోన్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దామని, ప్రజలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించామన్నారు. మండల కేంద్రాలతోపాటు మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేశామని, పట్టణాలతోపాటు ప్రతి పల్లెకు రోడ్లు వేయించామని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు... మరింత అభివృద్ధి, ప్రజా సేవ చేసేందుకు తనతోపాటు ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు.

కాపుల ఆత్మీయ సమావేశం

డోన్ : పట్టణంలోని వెంకటాచలం ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన కాపు, బలిజల ఆత్మీయ సమావేశానికి మంత్రి బుగ్గన ముఖ్య అతిథిగా హాజరయ్యారై ప్రసగించారు. కాపుల సంక్షేమం కోసం డోన్ పట్టణంలో ఎకరా 10 సెంట్లు కేటాయించడమే కాకుండా సంక్షేమ భవనానికి రూ.3కోట్లు కేటాయించామన్నారు. త్వరలోనే ఈ భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని సత్కరించారు.


కాపు, బలిజల సంఘు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన


నృత్యం చేస్తున్న మహిళా కౌన్సిలర్లు


ఆనందోత్సాహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


యువతుల కేరింతలు

దుర్గాపేటలో ఎన్నికల ప్రచారం


బుగ్గన సోదరులను సన్మానిస్తున్న దుర్గాపేట వాసులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీల్లో మంత్రి బుగ్గన సోదరుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త బుగ్గన సంజీవరెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి


సమావేశంలో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి బుగ్గన తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. కార్మికులకు అండగా ఉంటామని, మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, జల్లా శ్రీనివాసులు, మురళీ, భాస్కర్, వెంకటేశ్వర్, బాల శేఖర్, పాల కొల్లు ప్రభాకర్, మద్దయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం


కొండమనాయునిపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి


బందార్లపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని ప్రసాదరెడ్డి


చెన్నంపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాటసాని ఓబుల రెడ్డి, కాటసాని మేధాశ్రీ రెడ్డి

కొలిమిగుండ్ల: ఎన్నికల ప్రచార ఘట్టం శనివారం ముగిసింది. చివరి రోజు బందార్లపల్లెలో కొలిమిగుండ్ల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కాటసాని ప్రసాదరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు.

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లెలో శనివారం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీ అందించాలని ప్రజలను కోరారు.

అవుకు: మండల పరిధిలోని చెన్నంపల్లెలో శనివారం ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుకోసం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల రెడ్డి, కోడలు కాటసాని మేధా శ్రీ రెడ్డిలు ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను అందించారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన గుమ్మకొండ వాసులతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

డోన్ : మండలంలోని గుమ్మకొండకు చెందిన 15 కుటుంబాలు శనివారం టీడీపీని వీడి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్థానిక స్వగృహంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మకొండ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ బోయ హనుమన్న ఆధ్వర్యంలో ప్రసాద్, శేఖర్, అసాన్, కుమ్మరి మధు, తెల్లన్న మధు, మంగలి అనిల్, కోతల బుగ్గన,కుళ్లాయి, సురేష్, మధు, మోహన్ తదితరులకు మంత్రి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామస్తులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీలో కార్యాలయంలో స్టేట్ ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలీ, ఖాజా హుసేన్, వైఎస్సార్ సీపీ నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో బుడిగి నాగరాజు, బూసి మద్దిలేటి, బాల మద్ది, పెద్ద మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ బూసి మద్దయ్య వైఎస్సార్‌సీపీలోకి చేరారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి మద్దయ్య, సత్యాలు, కొత్తపల్లె చిన్న తిమ్మయ్య, ఎల్లక్రిష్ణ తదిరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలోకి చేరిన గోర్లగుట్ట గ్రామస్తులు

'బీసీ' మాయమాటలు నమ్మొద్దు!


రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


భారీగా తరలివచ్చిన యనకండ్ల గ్రామస్తులు

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ స్వగ్రామం యనకండ్లలో ఎమ్మెల్యే కాటసాని రోడ్‌షో
- ఘనంగా స్వాగతం పలికిన గ్రామస్తులు

బనగానపల్లె రూరల్ : టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి మాయమాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే బీసీకి మరోమారు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ స్వగ్రామం యనకండ్లలో శనివారం సతీమణి విజయమ్మ, కోడలు మేధాశ్రీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని నిర్వహించిన రోడ్‌షోకు గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గజమాలతో సత్కరించి స్వాగతించారు గ్రామస్తులు. పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ అవుతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు సాధ్యం కాని హామీలను మేనిఫెస్టోలో చేర్చారని విమర్శించారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని, ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి టీడీపీకి గట్టిగా గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, బనగానపల్లె మాజీ ఎంపీటీసీ అబ్దుల్‌ఫైజ్, యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, బీసీ మధుసూదన్‌రెడ్డి, కోడూరు వెంకటసుబ్బారెడ్డి, బీసీ మహేశ్వరరెడ్డి, పాపసాని గోపాల్‌రెడ్డి, బొబ్బల రామ్మోహన్‌రెడ్డి, బి మహేశ్వరరెడ్డి, బి మద్దిలేటి రెడ్డి, వడ్డె సుబ్బరాయుడు, ఈడిగ సంజీవ్‌గౌడ్, గొల్లమస్తాన్, బోయ గోపాల్, మాదిగ శ్రీనివాసులు, మాల ఓబులం తదితరులు పాల్గొన్నారు.

నా స్వగ్రామానికంటే యనకండ్లను మిన్నగా అభివృద్ధి చేశా...

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి స్వగ్రామమైన యనకండ్లను మా గ్రామానికన్నా మిన్నగా అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే బీసీ స్వగ్రామానికి చేసిందేమీ లేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పార్టీలకు అతీతంగా యనకండ్లకు రూ.25.24 కోట్లను అభివృద్ధి, సంక్షేమ రూపంలో ప్రజలకు అందజేశామన్నారు. గతంలోనూ తాను ఎమ్మెల్యే రైతులు, గ్రామపెద్దల విన్నపం మేరకు గ్రామంలో బండ్లగేటు ఏర్పాటు చేయించి గ్రామాభివృద్ధికి పాటుపడ్డామని, బీసీ ఎమ్మెల్యే కాగానే రద్దు చేశారని విమర్శించారు. స్వగ్రామం అభివృద్ధి చెందడం కూడా బీసీ ఓర్వలేరన్నారు. అలాగే యనకండ్ల రజకులకు దోబీ ఘాట్లు నిర్మించామని, ఈ గ్రామానికి చెందిన 175 మంది పేదలకు బనగానపల్లెలో ఇళ్ల స్థలాలను మంజూరు చేశామన్నారు. అప్పుడు కోర్టు స్టేతో అడ్డుకున్న బీసీ... పేదలకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడంతో సిగ్గులేకుండా తాను అడ్డుకోలేదని పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. పార్టీలకు అతీతంగా మీ గ్రామాన్ని అభివృద్ధి చేసిన తనను మరోమారు ఆశీర్వదించాలని యనకండ్ల ప్రజలను ఎమ్మెల్యే కాటసాని అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్ కొత్తపల్లె గ్రామంలో ఎంపీటీసీ మునేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు వెంగళరెడ్డి, శివ రామిరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. మే 13 జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు.


ఆర్ కొత్తపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

అవుకు: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని ఆ పార్టీ ముఖ్య నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అవుకు పట్టణ సమీపంలో తాడిపత్రి రహదారిలో ఉన్న చల్లా ఫామ్ హౌస్‌లో కొండమనాయునిపల్లె, జూనూతల, ఉప్పలపాడు, అవుకు గ్రామాల ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రజలను ఉద్దేశించి చల్లా మాట్లాడుతూ మా తండ్రి దివంగత నేత చల్లా రామక్రిష్ణా రెడ్డికి రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, దానికి కారణం మీ అభిమానం, ఆయన క్రమశిక్షణ అని పేర్కొన్నారు. తండ్రితోపాటు తమ్ముడు సైతం మరణించడంతో రాజకీయాల్లోకి వచ్చిన తనను ఆశీర్వదించాలని కోరారు. తన తండ్రిలాగే అభిమానులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. తాను ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తానని, ఈ నెల 13న ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రామాల నాయకులు, చల్లా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే కీలకం!

- బనగానపల్లె నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,41,179 మంది
- 4,931 మంది మహిళా ఓటర్లు అధికం
- రేపే పోలింగ్

కొలిమిగుండ్ల: డీలిమిటేషన్‌లో భాగంగా కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె నియోజకవర్గం ఏర్పడిన తర్వాత నాల్గవ సారి ఎన్నికలు జరుగబోతున్నాయి. ప్రధాన పార్టీల గెలుపు భవిత్యం మహిళా ఓటర్లపైనే ఆధారపడింది. జనవరి 22 ఓటర్ల జాబితా ప్రకారం 1,17,344 మంది పురుషులు, 1,21,531 మంది మహిళా ఓటర్లు, 25 మంది ఇతరులతో కలిపి మొత్తం 2,38,900 మంది ఓటర్లు ఉండేవారు. మార్చి 25న ఎన్నికల కమిషన్ తుది జాబితా విడుదల చేసింది. వీటి ప్రకారం బనగానపల్లె నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,41,695 మంది కాగా ఇందులో పురుషులు 1,18,621 మంది, మహిళలు 1,23,050 మంది ఉండగా ఇతరులు 24 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే 4,931 మంది అధికంగా ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో కంటే 2,279 కొత్త ఓటర్లు పెరిగారు. మే13న జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మహిళల ప్రభావం చూపనుంది.

నియోజకవర్గంలో మండలాలవారీగా ఓటర్ల వివరాలు:

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బనగానపల్లె	40,786	42,972	06	83,764
అవుకు	21,131	21,436	05	42,572
కొలిమిగుండ్ల	21,287	21,792	04	43,083
సంజామల	15,911	16,280	05	32,196
కోవెలకుంట్ల	18,997	20,563	04	39,564

ఓటింగ్ శాతం పెరగాలి


చల్లా కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

అవుకు: మండల కేంద్రం అవుకులోని చల్లా భవన్‌లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ చల్లా కుటుంబ సభ్యులతో శనివారం సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ముఖ్య నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డిలతో మండల రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో అవుకు మండలంలో ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేద్దామని చల్లా కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ కాటసాని, చల్లా కుటుంబాలు ఎన్నటికీ ఒకటిగానే ఉంటాయని, చిన్న చిన్న సమస్యలు సరిదిద్దుకుంటామని తెలిపారు.